ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 26 ఏప్రిల్ 2025



డబుల్ బెడ్‌రూం గృహాలకు విద్యుత్ సరఫరా

● తాగు నీటి సరఫరాకు ఏర్పాట్లు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాలచెట్టు సమీపంలో ఉన్న 560 డబుల్ బెడ్ రూం గృహాలకు ఎమ్మెల్యే చొరవతో విద్యుత్, తాగు నీరుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల లబ్ధిదారులకు గృహ నియామక పత్రాలు అందజేయగా విద్యుత్ సరఫరాలేక వారు నివాసం ఉండేందుకు అనాసక్తి చూపారు. ఇటీవల ఎమ్మెల్యే సందర్శించి ఏఈని కరెంటు ఇవ్వాలని, కమిషనర్‌ను తాగునీటికోసం ఆదేశించారు. ప్రధానంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించడంతో రెండురోజుల క్రితం ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం లబ్దిదారులు మంచిరోజు అని కుటుంబాలతో తరలివచ్చి ఉంటున్నారు.

ప్లాంటేషన్‌లో వన్యప్రాణుల కోసం నీటి కుంట

జైపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్లాంటేషన్‌లలో, అటవీ ప్రాంతంలో సంచరించే వన్య ప్రాణుల దాహార్తిని తీర్చడానికి నీటికుంటలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కాన్కూర్, ముదిగుంట గ్రామ సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్‌లో శుక్రవారం నీటి కుంటలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నీటి కుంటల పనులను చేపట్టినట్లు తెలిపారు. ఎండలు తీవ్రం కావడంతో నీటి కోసం వన్యప్రాణులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో నీటి ఊటలు ఉన్న ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ ఉండేలా తవ్వించి నీటి కుంటలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ వాచర్ శంకర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



వేతన.. వెతలు..!

- ఏడాదిగా జీతాల్లేక ధరణి ఆపరేటర్ల పస్తులు
- ఏజెన్సీ రద్దుతో టీజీటీఎస్‌కు అటాచ్
- ప్రభుత్వం నుంచి నేరుగా చెల్లింపు ప్రతిపాదన
- ఆదేశాలు రాక వేతనాలు ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 60 మంది ఆపరేటర్లు
- రూ.కోటికి పైగా బకాయిలు

మంచిర్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా వేతనాలు అందక ధరణి ఆపరేటర్లు వెతలు పడుతున్నారు. జీతాల కోసం ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ప్రభుత్వం నుంచి స్పందన ఉండటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలిసి గోడు వెళ్లబోసుకుని వినతి పత్రాలను సమర్పించినా.. చివరికి సీఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది..

టీజీటీఎస్‌కు అనుసంధానం...

గతంలో టెరాసిస్ అనే ఏజెన్సీ ద్వారా ధరణి ఆపరేటర్లకు వేతనాలు అందేవి. గత సంవత్సరం జనవరిలో ఆ ఏజెన్సీ కాంట్రాక్టు కాలం ముగిసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఏజెన్సీ గడువును పెంచకుండా పక్కనబెట్టింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా పని చేస్తున్న ఆపరేటర్లను తెలంగాణ ప్రభుత్వ టెక్నికల్ సర్వీసెస్ (టీజీటీఎస్)కు అనుసంధానం చేసింది. ఇకమీదట ఆ ఏజెన్సీ ద్వారానే వేతనాలు చెల్లించనున్నట్లు తెలిపింది. ధరణి ఆపరేటర్లుగా పని చేస్తున్న వారి వివరాలను ఏజెన్సీకి సైతం అందజేసింది. గతేడాది ఫిబ్రవరి నుంచి టీజీటీఎస్ ద్వారా తమకు వేతనాలు వస్తాయని ఆశపడిన ఆపరేటర్లకు చివరికి ఎదురుచూపులే మిగిలాయి. టెరాసిస్ ఏజెన్సీ కింద ఉన్నప్పుడు నెలనెలా వేతనాలు వచ్చేవి. ఇప్పుడు జీతాలు రాకపోగా... ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. మొదట్లో వీరిని తొలగించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినా తర్వాత మనసు మార్చుకుని, కొత్తవారిని నియమించే బదులు వారినే కొనసాగించాలన్న నిర్ణయానికి వచ్చింది. టెరాసిస్ ఏజెన్సీ నుంచి నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని టీజీటీఎస్‌కు తమను అటాచ్ చేయడంతో ధరణి ఆపరేటర్లు సంతోషించారు. భవిష్యత్తులో తమ సర్వీస్ రెగ్యులర్ అవుతుందని ఆశపడ్డారు. వేతనాలు కూడా పెరుగుతాయనుకున్నారు. కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. అసలు వేతనాలే రావడం నిలిచిపోయింది. ఏం చేయాలో తెలియని అనిశ్చితిని వారు ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 60 మంది ఆపరేటర్లు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 60 మంది వరకు ధరణి ఆపరేటర్లు ఉన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కోఆర్డినేటర్ హోదాలో ఒక్కో ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కలెక్టరేట్‌లలో కోఆర్డినేటర్‌తో పాటు ఆయనకు సహాయకులుగా ఇద్దరేసి ఆపరేటర్లు (బఫర్స్) ఉండేవారు. ఇప్పుడు వారిని తొలగించారు. ప్రస్తుతం కో ఆర్డినేటర్‌తోపాటు మండలాల వారిగా కొనసాగుతున్నారు. ధరణి ఆపరేటర్లకు ఇచ్చే వేతనం కూడా చాలా తక్కువ. వారికి ప్రస్తుతం నెలకు రూ.12,035 చొప్పున చెల్లిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 675 మంది ప్రస్తుతం పని చేస్తున్నారు. మొదట్లో వీరికి రూ.10వేల చొప్పున చెల్లించేవారు. ధరణి కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమితులైనవారిలో అత్యధికులు ఇంజనీరింగ్, ఇతర పట్టభద్రులే అయినప్పటికీ ప్రభుత్వం భవిష్యత్తులో వేతనాలు పెంచుతుందనే ఆశతో విధుల్లో చేరారు. ఏడాదిగా వేతనాలు రాకపోవడంతో కొందరు ఆపరేటర్లు పీఎఫ్ డబ్బు డ్రా చేసుకొని జీవితాలను వెళ్లదీస్తున్నారు.

ఆరేళ్ల క్రితం నియామకం...

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అన్ని మండలాల్లో తహసీల్దార్లకు, సంయుక్త సబ్ రిజిస్ట్రార్లుగా అదనపు బాధ్యతలను అప్పగించి, వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ల విధులు కూడా వారికే కేటాయించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేసి పరికరాలను సమకూర్చి..

మిగతా 7లో

గంజాయికి యువత దూరంగా ఉండాలి

● డీసీపీ భాస్కర్

● తాండూర్‌లో బెల్లంపల్లి డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు

తాండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మత్తులో యువత చిత్తవుతుందని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్‌లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఆవరణలోని మైదానంలో తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెల్లంపల్లి డివిజన్ కబడ్డీ పోటీలను డీసీపీ ప్రారంభించి మాట్లాడారు. యువతలో మార్పు తీసుకురావడం కోసం పోలీసుల ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభి నందనీయమన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, క్రీడలపై మక్కువ పెంచుకుని రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గంజాయి వదిలేద్దాం కబడ్డీ ఆడేద్దాం అనే నినాదంతో యువతలో మార్పు తీసుకురావడం కోసం పోటీలు నిర్వహించిన సీఐ కుమారస్వామిని, సిబ్బందిని అభినందించారు. ఈ పోటీలు మంచిర్యాల కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్ పర్యవేక్షణలో జరుగుతుండగా బెల్లంపల్లి డివిజన్ నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో తాండూర్ నివాసి అయిన ఎలుక రామ్‌చందర్ మొదటి బహుమతి రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి సిరంగి శంకర్ రూ. 30 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలు, నాలుగో బహుమతి దుద్దిళ్ల వేణుగోపాల్ రామ్మోహన్‌ల జ్ఞాపకార్థం తండ్రి దుద్దిళ్ల నారాయణరావు రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు సీఐ తెలిపారు. పోటీల సందర్భంగా విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు అందర్ని అలరించాయి. అనంతరం డీసీపీ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, భీమిని, మాదారం ఎస్ఐలు విజయ్‌కుమార్, సౌజన్య, తాండూర్ రాజమౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

విద్యుత్తు సేవల విస్తరణకు ప్రత్యేక యాప్

- వినియోగదారుల సమస్యలకు పరిష్కారం
- అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎన్‌పీడీసీఎల్ 6

వేసవి సెలవులు.. నైపుణ్యానికి నెలవులు

- చదువులకు విరామం.. ఆటపాటలకు సమయం
- ఫిజికల్ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ
- ఇష్టమైన రంగంలో రాణించేందుకు కృషి.. 7

భూభారతి చట్టంతో సమస్యల పరిష్కారం

● కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంతో సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కన్నాల రైతువేదికలో భూభారతి 225చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. భూములపై ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి వివిధాలకు తావులేకుండా రక్షణగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూభారతి చట్టంలో రైతులు కోర్టుల వరకు పోవాల్సిన అవసరం లేకుండా ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందన్నారు. భవిష్యత్‌లో భూ పంచాయతీలు ఉండవని జూన్ 2 నుంచి క్షేత్రస్థాయిలో అమలవుతుందన్నారు. తహసీల్దార్ చట్టంలోని ప్రతిఅంశంపై అవగాహన సాధించాలన్నారు. భూభారతి చట్టం ప్రజలకు, రైతులకు ఎంతో మేలు చేస్తుందని సాదాబైనామాల సమస్యలు సైతం పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జోష్న పాల్గొన్నారు.



భూ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్న రైతులు

భూ భారతి చట్టం.. రైతుల చుట్టం

తాండూర్ : భూ భారతి చట్టం రైతుల చుట్టమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని సురభి గోదా క్షేత్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూసమ స్యలను పరిష్కరించ డానికే భూ భారతి చట్టం రూ పొందించారన్నారు. ధరణి పోర్టల్‌లోని లేని అనేక సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని తెలిపారు. చట్టం రూపొందించే సమయంలో రైతుల సంక్షేమంకోసం వారి సమస్యల ను ప్రస్తావించి అభిప్రాయాలను చట్టంలో ప్రతి బింబించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. భూ భారతి చట్టంలో తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే అప్పీలు వ్యవస్థను కల్పించినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవ కాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, తహసీల్దార్ ఇమ్రా న్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సీఐ కుమారస్వామి, వ్యవసాయశాఖ అధికా రులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, మండలంలో పలు అభివృద్ధి పను లకు నిధులను మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మురళీధర్‌రావు, రవీందర్‌రెడ్డి, ఎండీ ఈసా, సిరంగి శంకర్ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రాస్తారోకో

చెన్నూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లక్కపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో తమపేర్లు రాలేదని ప్రజలు శుక్రవారం చెన్నూరు-మంచిర్యాల ప్రధానరహదారిపై రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ పంచాయతీలో 1104 మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు చేసుకోగా 70 మంది పేర్లు జాబితాలో వచ్చాయని, మరో 20 మంది పేర్లను ప్రస్తావించారని, ఇందులో ఎల్లక్కపేటకు చెందిన ఆరుగురి పేర్లు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేంటని అధికారులను అడిగితే మీ ఇష్టం వచ్చింది చేసుకోండని, ఎంపిక ప్రక్రియ ఆపడం కుదరని అధికారులు అంటున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా ఎంపిక చేస్తామని స్థానిక ఎమ్మెల్యే చెప్పారని, ఇప్పుడు ఇలా జరుగుతుందని వాపోయారు. అధికారులు మళ్లీ రీసర్వే చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ నిర్వహించడం గొప్ప విషయం

పెద్దపల్లి ఎంపీ వంశీక్రిష్ణ



హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ

మందమర్రిటౌన్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం గొప్ప విషయమని ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన భారత్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతి, అహింసా, ఆర్థిక సమానత్వం వంటి అంశాలు చర్చలు జరిగే కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధంతాలపై ఆధారపడి సమ్మిట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వందదేశాలకు చెందిన 450 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతుండడం గర్వకారణమన్నారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నంప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి

-డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్



అంబేద్కర్ నగర్ కాలనీలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

గర్మిళ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మలేరియా నిర్మూలనకు కృషి చేస్తున్నామని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దోమల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పారిశుధ్య సిబ్బంది నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయాలని, దోమలు గుడ్లు పెట్టకుండా నీటి నిల్వ ప్రదేశాలను వారానికి ఒకసారితీసివేయాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. జిల్లాలో 2025 సంవత్సరంలో ఇప్పటి వరకు 23,375 మందికి పరీక్షలు చేశామని, ఒకరికి మాత్రమే మలేరియా నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అనిత, శివ ప్రతాప్, అశోక్, సునీత, అమర్, రాము, రజిత, సబ్ యూనిట్ అధికారులు నాందేవ్, జగదీష్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్ అధికారి మూర్తి, సుమన్, పద్మ పాల్గొన్నారు.

జన్నారం : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని తపాలపూర్ గ్రామంలో మలేరియా వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సందీప్, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆశా కార్యకర్త విజయ పాల్గొన్నారు.

నెన్నెల : మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పాజిటివ్ కేసుల సంఖ్య పూర్తిగా తగ్గిందని, మరింతగా వ్యాధిని నియంత్రించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీకి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డప్పు రవికుమార్, ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవడంతో పట్టణాభివృద్ధి కుంటు పడిందని, ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 1/70 చట్టం ఉందని, ఎన్నికలు నిర్వహించలేమని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర మహిళ అధ్య క్షురాలు ప్రేమలత,నాయకులు శ్యాంసుందర్, గుడికందుల తిరుపతి, రహమత్ ఖాన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

న్యాయాధికారిని కలిసిన న్యాయవాదులు



జిల్లా ప్రధాన న్యాయమూర్తితో న్యాయవాదులు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్యను మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల నూతనంగా బార్ అసోసియేషన్ ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులు ప్రధాన న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రదానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, మాజీ అద్యక్షుడు గడి కొప్పుల కిరణ్‌కుమార్, న్యాయవాదులు పద్మ, మల్లేష్, రహమతుల్లి, సత్యం, ప్రకాశం ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాజలింగయ్య(ఫైల్)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రబోర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ మండలానికి చెందిన చెవుల రాజలింగయ్య(62) తన ద్విచక్ర వాహనంపై ఊత్కూర్ చౌరస్తా నుంచి ఆంధ్రబోర్‌లోని తన కుమారుని దుకాణానికి వెల్తుండగా వెనుకాల నుంచి ఓ కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని లక్షెటిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బీట్ అధికారి..

కోటపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం అటవీ బీట్ అధికారిప్రసన్న (28) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. కొంత కాలంగా ప్రసన్న ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ చికిత్స పొందుతోంది. చెన్నూరు పట్టణానికి చెందిన ప్రసన్న 2019లో అటవీ శాఖలో బీట్ అధికారిగా ఎంపికై విధులు నిర్వహిస్తోంది. ఈమె తండ్రి ప్రకాష్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి గతంలోనే మృతిచెందాడు. తల్లి గృహిణి కాగా ముగ్గురు సోదరులు ఉన్నారు. ప్రసన్న మృతికి అధికారులు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ సేవల విస్తరణకు ప్రత్యేక యాప్

- వినియోగదారుల సమస్యలకు పరిష్కారం
- అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎన్‌పీడీసీఎల్

వాంకిడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 20 రకాల సేవల తో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపొందించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు, అంతరాయం, బిల్లుల చెల్లింపు, గతంలో చెల్లించిన బిల్లులకు సంబం ధించిన సమాచారం, ఇలా ఏ విషయంలో సందేహాలు, సమస్యలున్నా సంస్థ కార్యాలయం గడప తొక్కాల్సిందే. మనం వెళ్లిన సమయంలో సంబంధిత అధికారి లేకపోవచ్చు, ఈ నేపథ్యంలో వినియో గదారుల ఇబ్బందులను తొలగించేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీన్ని సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని సమస్య నమోదు చేస్తే అధికారులు పరిష్కారం చూపుతూ ఈ యాప్ ద్వారా 20 రకాల సేవలందిస్తున్నారు.



సమయం ఆదా చేసుకోవచ్చు..
శ్రీనివాస్, ఏఈ

ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్తు సేవలను ఉన్నచోటు నుంచే పొందవచ్చు. సమయం ఆదా చేసు కోవచ్చు. యాప్ ద్వారా చేసిన ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్ లో నమోదవుతుంది. పరిష్కారానికి ప్రత్యేక విభాగం పర్యవేక్షణ ఉంటుంది.

కొత్త సర్వీసు..: నివాసర గృహంలోని విద్యుత్ మీటరు, పంట పొ లానికి నీరందించే బోరుబావికి కొత్త సర్వీసు ఎలా పొందాలనే విషయాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దరఖాస్తు చేసు కుంటే అది మంజూరైందా ? లేదా ? దరఖాస్తు ఏ స్థాయిలో ఉంది? అనే పూర్తి సమాచారం దరఖాస్తు నంబరు ఆధారంగా తెలుస్తుంది. కొత్త విద్యుత్తు కనెక్షన్ ఎలా తీసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఏఏ ధ్రువ పత్రాలు జతచేయాలి? వంటి సమాచారం యాప్‌లో ఉంది.

సొంతంగా రీడింగ్..: వినియోగదారులు నెల నెలా తాను వినియోగించిన విద్యుత్తును తానే లెక్కించుకునే వెసులుబాటు ఉంది. స్పాట్ బిల్లింగ్ తీసే వ్యక్తి సకాలంలో రాకుంటే వినియోగదారులే నేరుగా బిల్లింగ్ తీసుకునే అవకాశం ఉంది. నెలనెలా కేంద్రాలకు వెళ్లి వరుసలో నిల్చుని బిల్లు చెల్లించే అవసరం లేకుండా ఈ యాప్‌లోనే చెల్లించవచ్చు. ఆయా సర్వీసులకు సంబంధించి గతంలో చెల్లించిన బిల్లులకు సంబంధించిన సమాచారం చూసుకోవచ్చు.

ఫిర్యాదు ఇలా..: విద్యుత్తు సరఫరాలో లోటుపాట్లు, అంతరాయాలకు సంబంధించిన ప్రతి అంశంపై యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంది. పరిష్కారం ఏ స్థాయిలో ఎక్కడ పెండింగ్‌లో ఉందో చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య సరిష్కా రం కాకున్నా సంతృప్తిక రంగా లేకున్నా తిరిగి ఫిర్యా దు చేసుకోవచ్చు. క్షేత్ర స్థాయిలో సమస్య ఎదురైతే ఫోన్‌లో ఫొటో తీసి ఫిర్యాదు చేమయొచ్చు. జీపీఎస్ ద్వారా ఆ ఫిర్యాదు నేరుగా సంబంధిత అధికారికి చేరుతుంది. సంబంధిత ప్రాంత సమస్య పరిష్కారమవుంది.

పేరు లోడ్ మార్పు.. మీటర్ పేరు మార్చుకోవాలన్నా, సర్వీస్ సమార్థ్య (లోడ్) పెంచుకోవాలన్నా కావాల్సిన సమాచారం, చెల్లించాల్సిన నగదు వివరాలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. మీటరులో లోపాలుంటే మార్చుకునే వెసులుబాటు ఉంది. గృహ కేటగిరి నుంచి ప్యాపారం, వ్యాపార కేటగిరి నుంచి గృహ వినియోగానికి మార్చుకునే అవకాశం ఉంటుంది. చేయాల్సిందల్లా యాప్‌లో దరఖాస్తు చేయడమే.

ప్రమాదాల నివారణ..: విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఉపకరణాల వినియోగంలో ఆచరించాల్సిన పొదుపు సూచనలు యాప్‌లో ఉన్నాయి. 24 గంటలు పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. ఇలా 20 రకాల సేవల ను వినియోగించుకునే సదుపాయాన్ని కల్పించారు.

అధికారుల వివరాలు..: పట్టణ, గ్రామీణ స్థాయి అధికారులను సంప్రదించాలనుకుంటే వారి సెల్ ఫోన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయి. అధికారులను నేరుగా సంప్రదించవచ్చు.

బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

జైపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును అతి వేగంగా నడిపి ఒకరి మరణానికి కారణమైన బస్సు డ్రైవర్ జాడి ప్రేమ్‌సాగర్‌కు చెన్నూరు కోర్టు న్యాయాధికారి రవీందర్ రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. 2019లో మంచిర్యాల నుంచి చెన్నూరుకు ఆర్టీసీ బస్సును డ్రైవర్ ప్రేమ్‌సాగర్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. బస్సు పవర్ ప్లాంట్ వద్దకు రాగానే రాంగ్ రూట్‌లో వెళ్లి అక్కడ నిర్మిస్తున్న కల్వర్టును ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి గాయాలపాలై మృతిచెందాడు. దీంతో ఫతే మహ్మద్ ఫిర్యాదు మేరకు జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ విజేందర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు డ్యూటీ అధికారి రాజశేఖర్, ఎస్ఐ విజేందర్‌లు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. కేసు విచారణ జరిపగా నేరం రుజువు కావడంతో శుక్రవారం బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

లింగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జాదవ్ కేశాబాయి (65) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. కేశాబాయి కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగు తోంది. ఈనెల 22న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని చేనులో మృతదేహం ఉందని తెలియడంతో గ్రామస్థులు, పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతదేహం కేశాబాయిదిగా బంధువులు, స్థానికులు గుర్తించారు. కేశాబాయి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంగన్న తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



కాలిపోయిన ట్రాక్టర్

దహెగాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం పీపీరావు కాలనీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. కాగజ్‌నగర్ మండలం బోడపల్లి గ్రామానికి చెందిన కావుడే గోపాల్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో వరిగడ్డిని నింపుకుని బోడపల్లికి తీసుకువస్తున్న క్రమంలో పీపీరావు కాలనీ సమీపంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు తాకడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో వరిగడ్డితో పాటు ట్రాక్టర్ (టీజీ 204428)కు మంటలు అంటుకున్నాయి. మంటలు అంటుకుని ట్రాక్టర్ ఇంజన్, వరిగడ్డి కాలి బూడిదయ్యాయి. ప్రమాదం నుంచి డ్రైవర్ సురక్షితంగా బయట పడినట్లు స్థానికులు తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వాసవిక్లబ్, కిరాణమర్చంట్, జర్నలిస్టులు, ఉపాధ్యాయ సంఘాలు, ట్రాస్మా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో ప్రారంభమైన ఈ ప్రదర్శన గాంధీచౌక్, వివేకానంద చౌక్ మీదుగా కొనసాగింది. పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చిలావేరి వెంకన్న, గుండా ప్రమోదు, గుండా వెంకన్న, పాతశీను, సతీష్‌బాబు, విశాల్, ఊశన్న, చైతన్య, సంతోష్, జర్నలిస్టులు వేణుగోపాల్, కృష్ణంరాజు, ప్రకాష్‌గౌడ్, మహేష్, శ్రీనివాస్, సురేష్‌చారి, రాధకృష్ణచారి, బిక్కాజీ, రాజు, రవి, నీతేష్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం రాత్రి యువకులు, గ్రామస్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిం చారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం
రూ. 2.95 కోట్ల ఆస్తి నష్టం



ప్లాస్టిక్ గోదాంలో చెలరేగుతున్న మంటలు

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఏసీసీ క్వారీ రోడ్డులోని శివశక్తి బేరింగ్ యూనిట్స్ ప్లాస్టిక్ గోదాంలో గురువారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక జిల్లా అధికారి భగవాన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు అంటుకోవడంతో ప్లాస్టిక్ ముడిసరుకు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2.95కోట్లు ఆస్థినష్టం సంభవించింది. మంచిర్యాల రెండు, చెన్నూర్, గోదావరిఖని, బెల్లంపల్లి మొత్తం ఐదు ఫైర్ ఇంజన్‌తో ఫైర్ అధికారులు రమేశ్‌బాబు, పవన్ కుమార్, అనూష్‌కుమార్, రవి, సిహెచ్. చందర్ మంటలు ఆర్పారు.

పోచమ్మ ఆలయ సమీపంలో..

నస్పూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీసీసీలోని పోచమ్మ ఆలయం సమీపంలోని పోలేరమ్మ గుడి పక్కన పరసరాల్లో గురువారం రాత్రి మంటల వ్యాప్తి చెందాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. చుట్టు పక్కల ఆలయానికి చెందిన కర్రలు, పైపులు, పచ్చని మొక్కలు కాలిపోయాయి. శుక్రవారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు గమనించి అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేసారు. పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ చెత్తను డంపింగ్ చేయడం వలన ఈ ప్రమాదం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు గూడుపు సింహాచలం, అప్పారావు, బంగారు రాజు, దల్లైపాల్ ఈశ్వర రావులు తెలిపారు.

భూ భారతి చట్టంతో రైతులకు మేలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

పెంచికలపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి నూతన చట్టంలో పొందు పరిచిన అంశాలు, హక్కుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉందని చెప్పారు. చట్టంలో కీలకమైనది అప్పీలు వ్యవస్థ అన్నారు. ఎవరైనా రైతుకు అన్యా యం జరిగినట్లయితే అపీల్ వ్యవస్థ ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ ధరణి చట్టం ద్వారా చాలా మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఇప్పుడు అలాంటి సమస్య ఉండదని, ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంలో పొందు పరిచిన అంశాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలో గల రైతు వేదికలో భూభారతి నూతన చట్టంలో పొందు పరిచిన అంశాలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయయలతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ భూ భారతి చట్టంలోని అంశాలను తెలుగుతో పాటు రైతుల అభ్యర్థన మేరకు మరాఠీ భాషలో అవగాహన కల్పించారు. త్వరలో గ్రామ పాలన అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ల నియామకంతో భూ సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో రమేష్, వ్యవ సాయాధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

132 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా ట్రయల్ రన్

కౌటాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలోడి గ్రామ శివారులో నిర్మించిన 132 కేవీ సబ్ స్టేషన్ టవర్ లైన్ విద్యుత్ సరఫరాను శుక్రవారం సీఈ విజయ్ పాపారావు ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసుగాం నుంచి తలోడి 132 కేవీ సబ్ స్టేషన్‌వరకు లైన్ టెస్టింగ్ విజయవంతంగా పని చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సబ్ స్టేషన్ నుంచి ఔట్ గోయింగ్ సరఫరా ఇచ్చేందుకు సమయం పడుతుందన్నారు. విద్యుత్ లైన్ పనులు నడుస్తున్నందున వెంటనే ఔట్ గోయింగ్ సరఫరా చేయడం లేదని చెప్పారు. పనులు పూర్తి కాగానే ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఈ శేషరావు, ఈఈ రవికుమార్, డీఈ నాగరాజు, గులాబ్, ఏడీఈ లక్ష్మీనారాయణ, ఏఈలు శ్రీకాంత్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ధర్నా

మందమర్రి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మందమర్రిలో బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఆందోళన చేపట్టింది. స్థానిక రాష్ట్రీయ రహదారి నుంచి జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించింది. అనంతరం కార్యాలయం ముందు ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న వారిని ఉద్దేశించి ఆ సంఘం ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, రాజశేఖర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో నూతన గనులను ఏర్పాటు చేయకపోతే సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో కార్మికుల వైద్యానికి సంబంధించి ప్రవేశపెట్టిన రెఫరల్ పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జీఎంకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లం అశోక్, తోట రాజిరెడ్డి, కొండల్రావ్, దాసరి శ్రీనివాస్, బడికెల సంపత్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ అన్నారు. జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం వారు జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అయ్యగారు రమేష్, మారం శ్రీనివాస్, గొర్ల సంతోష్, ఉత్తేజ్ రెడ్డి, మల్లయ్య, మహిపాల్ రెడ్డి, రమణారెడ్డి, పాల్గొన్నారు.

ఆర్కే 7 గని ఆదర్శం

సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు



వేడుకలకు హాజరైన డైరెక్టర్లు, జీఎంలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని అన్నింటా ఆదర్శంగా నిలుస్తోందని సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ(ఈ అండ్ ఎం), వెంకటేశ్వర్లు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్), శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ అన్నారు. ఆర్కే 7 గని ఏర్పాటై 50 ఏళ్లు అయిన సందర్భంగా గని ఆవరణలో నిర్వహించిన స్వర్ణోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఏదైనా నూతన టెక్నాలజీ ప్రవేశపెట్టాలంటే ఆర్కే 7 నుంచే ప్రారంభమవుతుందని కొనియాడారు. ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తారని అన్నారు.50 వసంతాల జ్ఞాపికలను ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీపీపీ ఈడీ చిరంజీవి, ఎస్‌టీపీపీ జీ ఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంత్ సాహు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంక టేశ్వర్‌రెడ్డి, ఆర్కే గ్రూప్ ఏజెంట్ రాజేందర్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, ఆర్కే 5,6 గ్రూపు ఏజెంట్ శ్రీధర్, ఆర్కే 7 గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్ రావు, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు బాలాజీ, బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారేపల్లి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి



ఇందారం ఓసీపీని పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి డైరెక్టర్ పా కె వెంకటేశ్వర్లు అన్నారు. ఇందారం ఓసీపీని శ్రీరాంపూర్ జీ ఎం శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రక్షణతో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని, లక్ష్యాల సాధనకు ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. ఉపరితల గనులకు రావాల్సిన యంత్రాలను, సామగ్రిని సమకూర్చుకో వాలన్నారు. ఓబీ కాంట్రాక్టు నిర్వహకులు ఏ నెలకు ఆ నెల ఓబీ ఉత్పత్తిని అధిగమించాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సర నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరు ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు సింగరేణి నీటి బిందువు జల సింధువు కార్యక్రమంలో భాగంగా ఇందారం ఉపరితల గని ఆవరణలో నిర్మిస్తున్న నీటి కుంట ప్రదేశాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, రక్షణా ధికారి సతీష్, సర్వే అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. 139వ మే డే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హక్కులు కోసం పోరాడలని తెలిపారు. కార్యక్రమంలో మేకల ం మన్న, భూపతి యాదరి, సికిందర్, వెంకన్న, అప్పారావు, శంకర్, సుధాకర్, రాము, రాంబాబు, కమలమ్మ, కవిత, శారద, శిరీష, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



28 నుంచి స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఈ నెల 28వ తేదీ నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎ.రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు తరగతులకు హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించాలని కోరారు.

పనుల వేగవంతమే లక్ష్యం



కేకే ఓసీలో క్రేన్‌ను ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పనుల వేగవంతం కోసమే నూతన క్రేన్‌లనుకొనగోలు చేస్తున్నామని, ఈ ఆర్థిక సంవత్సరం నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో శుక్రవారం కోటి 73లక్షల 40వేల 824 రూపాయలతో కొనుగోలు చేసిన క్రేన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మల్లయ్య, ప్రాజెక్టు ఇంజనీర్ వంశీధర్, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీధర్‌గౌడ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి కుమారస్వామి, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, ఏఐటీయూసీ ఓసీ ఇన్‌చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులంటేనే పిల్లలకు ఆటవిడుపు. పది నెలలుగా రోజు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులంతా అమ్మమ్మ, నానమ్మ, ఇళ్లకు వెళ్లి ఆటలు అడుతూ పాటలు పడుతూ కాలక్షేపం చేస్తుంటారు. సెలవుల్లో వారికి నచ్చిన ఆటలాడుతూ ఆనందంగా గడుపుతారు. కబ్బడ్డీ, ఖోఖో, క్రికెట్, టెన్నిస్, వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నీకాయిట్, చదరంగం, క్యారమ్, ఇలా ఎన్నో ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటారు. మరికొంత మంది పిల్లలు సిమ్మింగ్, శాస్త్రీయ నృత్యాల్లో శిక్షణ తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. కొందరు కంప్యూటర్ విద్యను నేర్చుకునేందుకు సిద్ధం అవుతున్నారు. మరికొందరు ఆత్మరక్షణకు కరాటే కుంగ్ ఫూ వంటి విద్యలు నేర్చుకునేందుకు ఇష్టపడుతున్నారు. వేసవి సెలవులను విద్యార్థులు ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు అనే దానిపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం..

- మంచిర్యాల క్రైం/దండేపల్లి,ఆంధ్రజ్యోతి



వేసవి సెలవులు నైపుణ్యానికి నెలవులు

- చదువులకు విరామం.. ఆటపాటలకు సమయం
- ఫిజికల్ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ
- ఇష్టమైన రంగంలో రాణించేందుకు కృషి..

ఖోఖోతో చక్కని వ్యాయామం

సంవత్సరం మెత్తం పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు వేసవిలో క్రీడలతో చక్కని ఆరోగ్యం తమ సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఖోఖోతో శరీరం అంతా కదలటంతో పాటు ఖో ఇచ్చినప్పుడు విద్యార్థి పరిగెత్తడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది.

క్రికెట్‌తో చురుకుదనం..

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బాలు, బ్యాట్‌తో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తుంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు, చురుకుదనం పెరుగుతుంది. శరీర అలసటతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది.

వాలీబాల్ ఆటతో..

వాలీబాల్ ఆటతో శరీరంలో అన్ని అవయవాలు కదులుతాయి. కాళ్లకు చేతి కండరాలకు పని చేప్పే ఆట. అందరికి మంచి వ్యాయామం అవుతుంది.

ఫుట్‌బాల్‌తో..

వేగంగా ఆడే ఆటలో ఫుట్‌బాల్ ఒకటి. దీనివల్ల శరీరంలో అన్ని అవయవాలు చురుకుగా పనిచేస్తాయి. రక్త సరఫరా సక్రమంగా జరిగేందుకు ఫుట్‌బాల్ ఆట ఎంతో దోహదపడుతాయి.

చదరంగం ఆటతో ..

విద్యార్థులో మేథస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైంది. ఆటతో విద్యార్థికి సమయస్ఫూర్తి, ఆలోచనా శక్తి సమస్యలను ఎలా పరిష్కరించాల్లో నేర్పుతుంది. ఇంటి వద్దనే విద్యార్థి శిక్షకుడి సహాయంతో ఆటనేర్చుకోవచ్చు.

నృత్య శిక్షణకు మంచి సమయం...

నృత్యంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు డ్యాన్స్ నేర్చుకునేందుకు వేసవి సెలవులు ఎంతో ఉపయోగపడుతాయి. కూచిపూడి, భరత నాత్యం లాంటి డ్యాన్స్‌లు నేర్చుకోవటం ద్వారా వ్యక్తి అభిరుచి పెరగటంతో పాటు. పదిమందిలో గుర్తింపు వస్తుంది.

కంప్యూటర్ కోర్సులు..

నేటి పోటీ ప్రపంచం అంతా టెక్నాలజీమయం. దాని ప్రాధ్యాన్యాన్ని గుర్తించి తల్లిదండ్రులు వేసవిలో తమ చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించటానికి సదకాశం. అదేవిధంగా చిన్నారులు సైతం కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

ఇంగ్లీష్‌పై పట్టుకు ప్రయత్నం..


ఉజ్వల భవిష్యత్‌కు అవసరం. ముున్ముందు చదువుకునే కోర్సు ఉత్తమమైన ప్రతిభ, పోటీ పరీక్షల్లో రాణించేందుకు అవసరమైన ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు విద్యార్థులకు వేసవి సెలవుల్లో మంచి అవకాశం.

ఈత నేర్చుకోవడానికి సదావకాశం..

ఈత నేర్చుకోవడానికి వేసవి సెలవులను సదవకాశంగా చెప్పవచ్చు. అత్యవసర సమయాల్లో తమను తాము రక్షించుకోవటానికి ఇది ఉపయోగపడుతుంది. బావుల వద్దకు, చెరువుల వద్దకు పిక్నిక్‌లకు వెళ్లినప్పుడు అనుకోని ప్రమాదం జరిగితే సులభంగా బయట పడేందుకు అవకాశం ఉంటుంది.

తైక్వాండో కరాటేలో శిక్షణ..

తైక్వాండో (కరాటే)లో శిక్షణ తీసుకోవడం ద్వారా చిన్నారుల ఆత్మరక్షణకు దోహదపడుతుంది. నాలుగేళ్ల పిల్లల నుంచి ఇంటర్ విద్యార్థులు సైతం తైక్వాండోలో శిక్షణ పొందవచ్చు. కరాటే లో శిక్షణ తీసుకోవటంతో విద్యార్థులకు శారీరక మానసిక ప్రశాంతత ఉంటుంది. ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే సమస్యలను సులువుగా అధిగమించేందుకు సహాయపడుతుంది.





వేతన వెతలు..

(5వ పేజీ తరువాయి)

ఆరేళ్ల క్రితం ఆపరేటర్లను నియమించింది. అప్పటి నుంచి టెరాసిస్ ఎజెన్సీ ద్వారా వీరు పని చేస్తుండగా, టీజీటీఎస్‌కు అటాచ్ చేసినప్పటి నుంచి సమస్యలు మొదలయ్యాయి.

ఆపరేటర్ల వెట్టి చాకిరి....

కేవలం ఆపరేటర్ విధులే కాకుండా, తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ఎన్నికల సర్వే, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇతరత్రా డేటా ఎంట్రీ కూడా వారితోనే చేయిస్తున్నారు. వేతనం తక్కువగా ఉన్న వారు రకరకాల పనుల కారణంగా వెట్టి చాకిరికి గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహించడమేగాక, అవసరమైతే రాత్రి వరకు కూడా పని చేయాల్సివస్తోంది. పైగా మండలానికి ఒక్క ఆపరేటరే ఉండడంతో అత్యవసర పని ఉన్నప్పుడో, ఆనారోగ్యానికి గురైనప్పుడో సెలవు పెట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక మండలం ఆపరేటర్ సెలవు పెడితే పక్క మండలం ఆపరేటర్‌తో విధులు నిర్వ హింపజేస్తున్నారు.

రూ. కోటి పై చిలుకు బకాయిలు...

ఒక్కో ఆపరేటర్‌కు రూ.1.50 లక్షల వేతన బకాయిలు రావలసి ఉంది. మొత్తంగా 60 మందికి పైబడి ఉన్న ఆపరేటర్లకు రూ. సుమారు రూ. కోటి పై చిలుకు బకాయిలు ఉన్నాయి. సమాన పనికి సమా న వేతనం చెల్లించడంతో పాటు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆపరేటర్లు కోరుతున్నారు. ప్రతీ నెల వేతనాలను అందించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించి నందున ఇప్పటికైనా స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని వారు వేడుకుంటున్నారు. జూన్ 2021లో వచ్చిన జీవో 63 ప్రకారం తమ వేతనాలు రూ. 31,040కు పెంచాలని కోరుతున్నారు. మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నార

సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సన్న బియ్యంతో వండిన భోజనం చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం బూదాకలాన్ గ్రామంలో రేషన్‌కార్డు లబ్ధిదారుల ఇంట్లో సన్నబియ్యంతో చేసిన ఆహారాన్ని భోజనం చేసి మాట్లాడారు. అనంతరం మండలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆర్డీవో హరిక్రిష్ణ, తహసీల్దార్ జోష్ణ, పాల్గొన్నారు.

కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్/గర్మిళ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండలం మంగెనపల్లి గ్రామానికి చెందిన కన్నయ్య పెత్తందారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడని, అతని కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నయ్య మృతికి కారణమైన ఎనగంటి చిన్నన్న, అతని భార్య లక్ష్మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నామని, ఆదివాసీలు, ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బాధితురాలు నాయిని స్వరూప, సంఘం నాయకులు శంకర్, పోశం, రాజేశ్వరి, ఉమారాణి పాల్గొన్నారు.

ఉపాధి లేక బ్యాండ్ కార్మికుల విలవిల

మందమర్రిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : శుభకార్యాలకు డీజేల వినియోగం పెరగడంతో బ్యాండు కార్మికుల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని మ్యూజికల్ బ్యాండ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తాజుద్దీన్ బాబు, కోశాధికారిగా అక్బర్‌షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ కొన్నేండ్లు క్రితం వివాహాలకు, ఇతర శుభకార్యాలకు బ్యాండ్ కార్మికులే ప్రధాన పాత్ర పోషించేవారన్నారు. ఇప్పుడు ఫంక్షన్‌లకు, ఈవెంట్లకు డీజేలను వినియోగిస్తున్నారన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు వినోద్‌సాయి, అఖిల్, సుకుర్, అప్జల్, శశిధర్, దుర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డన్ సర్చ్

చెన్నూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంబడిపల్లి గ్రామంలో చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అలాగే నాటు సారా స్థావరాలను గుర్తించి బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి నాటు సారా, బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్ రావు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి

గర్మిళ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చీపెల్లి బాపు అన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని కాచిగూడలో గల ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఉపాధ్యాయుడు బోధించడం వల్ల విద్యార్థులకు మంచి బోధన అందుతుందన్నారు. నిత్య జీవితంలో వినియోగంలో ఉండే అధ్యాయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నాయకులు పార్వతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్‌కేంద్రంలో ఏర్పాటు చేసిన సైన్స్ వేసవి శిబిరాన్ని డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్‌లోని సూత్రాలను తెలుసుకునేందుకు వేసవి శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆలోచన శక్తి పెంపొందించుకునేలా విద్యార్థులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 186 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వారలో 120 మందికి అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రబోర్‌లో తాలంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సురేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఈనెల 24న ఇంటి యజమాని బొప్పు శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి తాను వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం శ్రీనివాస్ ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో లోపటికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సుమారు 50వేల రూపాయల విలువ గల బంగారు ఆభరణాలు. 10వేల రూపాయల విలువ గల వెండి ఆభరణాలతో పాటు 25వేల రూపాయల నగదును గుర్తు తెలియని దొంగలు దొచుకెల్లడం జరిగింది. బాధితుడి పిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

నెన్నెల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతిపై రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేంద్రనాథ్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు, నాయకులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

పల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికివేత

బెల్లంపల్లి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పల్లె ప్రకృతి వనంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 25కిపైగా చెట్లను నరికివేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందించారు. మండల అధ్యక్షుడు ఏట మధుకర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో కఠినమైన నియమ నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కి ప్రస్తుతం ఇండ్లు ఉన్న వారికి ఎకరాల భూములు ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శి మధునయ్య, నాయకులు అజయ్‌కుమార్, చరణ్‌రాజ్ పాల్గొన్నారు.

కార్మికుల జిల్లా సదస్సును జయప్రదం చేయండి

దండేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయు కార్యలయంలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించతలపెట్టే జి ల్లా సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్ర వారం దండేపల్లిలో సీఐటీయు మం డల కన్వీనింగ్ కమిటి సమావేశంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. మే20న దేశ వ్యాప్తంగా సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈకార్య క్రమానికి ముఖ్య వ్యక్తులు సీఐటీయు అఖిల భారత నాయకులు సాయిబా బా, సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, సీఐటీయు రాష్ట్ర కోశాధికారి రాములులు హాజరుకానున్నారు. అధిక సంఖ్యలో హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



చెన్నూరులో..ముస్లిం మైనార్టీ నాయకులు



నస్పూర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన ట్రస్మా నాయకులు

మంచిర్యాల క్రైం, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మశాంతించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

నస్పూర్ : నస్పూర్‌లో ట్రస్మా నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ట్రస్మా నాయకులు మలెత్తుల రాజేంద్రపాణి, రేగళ్ల ఉపేందర్, దేవన్న, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చెన్నూరు : పట్టణంలోని ఐబీ వద్ద ముస్లిం మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేసి మౌనం పాటించారు. ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో బస్టాండ్ వద్ద యువకుల గ్రామస్థులతో కలిసి కొవ్వొతులతో నిరసన ర్యాలీ చేపట్టారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ నాయకులు అన్నారు. తాళ్లపేట మసీదులో శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన నిర్వహించారు.

భీమారం : పహెల్గాం దాడికి నిరసనగా శుక్రవారం రాత్రి భీమారం మండల కేంద్రంలో కొవ్వొత్తులతో యువకులు ర్యాలీ నిర్వహించారు.

గర్మిళ్ల : టీజీఈజేఏసీ నాయకులు శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, జిల్లా సెక్రటరీ జనరల్ వనజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నెన్నెల : ఉగ్రదాడి మృతులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. శుక్రవారం సాయంత్ర మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేష్ పాల్గొన్నారు.

భీమిని : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మహేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.



మందమర్రిలో కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్ : కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

- పట్టణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులు అర్పించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు గురు ప్రసాద్, రాజేశం, సుదర్శన్ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై పోలీసు నిఘా..

కోటపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో ఇష్టారీతిన పోస్టులు పెడుతుండడంతో విభేదాలు ఏర్పడి పలు చోట్ల గొడవలు జరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాల వినియోగం పెరగడం, తప్పుడు పోస్టులు పెడుతుండడంతో వీటిపైన పోలీసులు నిఘా పెంచారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాజిక మధ్యమాల పోస్టుల కారణంగా పల్లెల్లో శాంతి భద్రతల సమస్య ఏర్పడే అవకాశం ఉంది. నిర్ధారణకు వచ్చిన పోలీసులు దీన్ని కట్టడి చేసే దిశగా కార్యచరణ రూపొందిస్తున్నారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టేందుకు గ్రామాల్లో వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో సాధారణ వ్యక్తుల మాదిరిగా పోలీసులు నమోదవుతున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో చేరుతున్న పోలీసులు ఈ వ్యవస్థపై నిఘా పెడుతూ అడ్మిన్‌లపై చర్యలు తీసుకునే దిశగా కసరత్తు ప్రారంభించారు.

తప్పుడు పోస్టులపై చర్యలు

శాంతి భద్రతల విఘాతం , అసత్యాల ప్రచారం ఇష్టారీతిన పోస్టు లు పెట్టే వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో కొన్ని జరగని ఘటనలు జరిగినట్లుగా పోస్టులు పెడుతున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. తీరు మారకపోతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

వీపీవోల నియామకానికి కసరత్తు

గతంలో గ్రామాల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీవో) ఉండేది. వారు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలు తెలుసుకోవడం, ప్రజలతో మమేకమయ్యే అవకాశం ఉండడంతో ఈ వ్యవస్థను పునరుద్ధరించేందుకు పోలీసు శాఖ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వీపీవోల నియామక ప్రక్రియ చేపడుతుండగా దీంతో నేరాల నియంత్రణతో పాటు సామాజిక మాధ్యమాల్లో అతస్య ప్రచారాలకు అడ్డుకట్ట వేసే బాధ్యతను అప్పగించడం సులువు అవుతుందని పోలీసులు భావిస్తున్నారు.




గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహిళల రక్షణకే షీటీం

జైపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ కోసమే షీటీం ఏర్పాటు చేయబడిందని షీటీం సభ్యులు జ్యోతి, శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆకతాయిల ఆటకట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షీటీం కర్తవ్యమన్నారు. ప్రతీ ఒక్కరు వారి పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలపాలన్నారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆకతాయిల నుంచి వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లు మల్లేష్, భరోసా సెంటర్ సబ్‌ఆర్డినేటర్ పుష్పలత పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకోవాలి

జైపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శెట్‌పల్లి, గంగిపెల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం రైసుమిల్లుల్లో అన్‌లోడ్ అయిన వెంటనే ట్రాక్ షీట్, ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద రైతుల కోసం చల్లని తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు.





నిధులు రాక.. పనులు సాగక..

- ఏళ్లుగా పూర్తి కాని సాగునీటి ప్రాజెక్టులు
- నీటి వనరులున్నా ప్రయోజనం కరువు
- వర్షాధారంపైనే పంటల సాగు
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏళ్లుగా ప్రధాన ప్రాజె క్టుల పనులు పూర్తి కాకపోవడంతో రైతాంగాం అవస్థలు పడుతోంది. సరైన సాగునీటి వసతి లేక వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా మారుతోంది. గత్యం తరం లేక వర్షాధార పంటలు వేస్తూ సరి పెట్టుకోవల్సి వస్తోంది. చివరికి వానొస్తే పంట లేకుంటే లేదన్నట్లుగా అన్నదాత పరిస్థితి దయనీయంగా మారింది. ప్రాజె క్టులు పూర్తి చేసి సాగునీరు అందిస్తే తప్ప రైతులకు ప్రయోజనం చేకూరే పరిస్థితి కనిపించడం లేదు. ప్రధా నంగా కుమరం భీం జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పనులు పూర్తి కావడం లేదు.

● పూర్తికాని కుమరం భీం..

జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు అయిన కుమరం భీం పనులు ముందుకు సాగడం లేదు. ఆసిఫాబాద్-సిర్పూరు నియోజకవర్గాల్లోని రైతుల కోసం రెండు గుట్టల మధ్య కుమరం భీం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించారు. 45వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిం చారు. పది టీఎంసీల సామర్థ్యంలో సుమారు 600 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. 2005లో ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేశారు. సిర్పూరు నియోజకవర్గంలోని 45వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఎడమ కాల్వ నిర్మాణం కోసం 2011లో పనులు ప్రారంభించారు. ఒక్క ఎడమ కాల్వ ద్వారా సిర్పూరు నియోజక వర్గంలోని సిర్పూరు(టి), కాగజ్‌న గర్, కౌటాల తదితర మండలాలకు 65 కిలోమీటర్ల మేర కాల్వ పనులు ప్రారంభించారు. పూర్తి స్థాయిలో నిధులు రాక, అటవీశాఖ క్లియరెన్స్, భూ సమస్యలు తలెత్తడంతో పనులు ముందకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రధాన కాల్వ పనులు పూర్తి చేశారు. కానీ ఉప కాల్వ నిర్మాణాలు ఇంకా ముందకు సాగడం లేదు. ఒక వైపు అంచనా మేరకు నిధులు విడుదలవ్వక, మరో వైపు కాంట్రాక్టర్ చేసిన పనికి బిల్లులు రాకపోవడంతో ఈ కాల్వ పనులు ముందుకు సాగడం లేదు. సిర్పూరు నియోజవకర్గంలోని వివిధ ప్రాంతాల వాసులకు ఎంతగానో ఉపయోగడే కుమరం భీం ఎడమ కాల్వ పనులు వేగంగా పూర్తి చేస్తే ఈ ప్రాంత రైతులు మూడు పంటలు తీసేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ కాల్వల పనులు పూర్తి చేసేందుకు ఇంకా రూ.40 కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు చెబుతున్నా రు. కాల్వ పనులు చేపట్టేందుకు సుమారు 100 ఎకరాలు సేకరించాల్సి ఉంది. అధికారులు, నాయకులు స్పందించి పెండింగ్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

● రూ.125 కోట్ల వ్యయంతో..

సిర్పూరు నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండ లం జగన్నాథ్‌పూర్ వద్ద 2005లో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.125 కోట్ల వ్యయంతో జగన్నాథ్‌పూర్ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా పూర్తి కావడం లేదు. పనులు ప్రారంభించిన మొదట్లో భారీ వర్షానికి పిల్లర్ కుంగి పోయింది. దీంతో పనులకు ఆటంకం కలిగింది. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును వివిధ సమస్యలు ఏర్పడ డంతో అప్పటి ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు గడువు పెంచింది. నిధుల కేటాయింపు పూర్తి స్థాయిలో లేకపోవడంతో పిల్లర్ల దశ వీడని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు వినియోగంలోకి వస్తే సిర్పూరు నియోజకర్గంలోని కాగజ్‌నగర్, దహెగాం, భీమిని మండలాల్లోని రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. తెలం గాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక ఈ ప్రాజెక్టు సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి అప్పటి ఎమ్మెల్యే కోనప్ప తీసుకెళ్లారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగడంతో ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఏకంగా 246.49 కోట్లకు పెంచి పనులు ప్రారంభించాలని సూచించింది. ప్రస్తుతం పిల్లర్లు స్థాయి వీడి గేట్ల వరకు వచ్చింది. మరో వైపు కాల్వలు నిర్మాణం కూడా చేపట్టేం దుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. కానీ ఆశించిన మేర పనులు సాగడం లేదు. కాల్వల నిర్మాణం పరిస్థితి అదే తరహాలో ఉంది. ఇప్పటికీ 20 ఏళ్లు కావస్తున్నా కూడా అదే పరిస్థితి ఉండడంతో ఈ ప్రాజెక్టును నమ్ముకున్న రైతులు నిరాశ చెందుతున్నారు. గత ఏడాది ఈ ప్రాజెక్టును జిల్లా మంత్రి సీతక్క పరిశీ లించి పనులు పూర్తి చేయాలని నిధుల కేటా యించారు. కానీ సరిపడా నిధులు మంజూరవక పోవడంతో పనులు నిలిచిపోయాయి.

అసంపూర్తిగా జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు..

\- ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు



సిర్పూరు నియోజకవర్గంలో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు ఇంకా అసంపూర్తి దశలోనే ఉంది. నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసు కోవాలి. అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టు పనులకు అంచనా రూపొందించాలి.

పనులు పూర్తయితే రైతులకు మేలు..

\- గుళ్లపల్లి ఆనంద్, టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్



జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు, కుమరం భీం ఎడమ కాల్వ ప్రాజె క్టులు పూర్తి చేస్తే రైతులు మూడు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది. ప్రభు త్వం వ్యయం అంచానాలు రూపొందించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

సమ్మెకాలపు ఒప్పందం అమలు చేయాలి



రాస్తారోకో చేస్తున్న కార్మికులు, నాయకులు

రెబ్బెన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటిలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టర్ల కార్మికులైన డ్రైవర్లు, క్లినర్లకు సమ్మె కాలపు ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలని శుక్రవారం ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ మాట్లాడుతూ గతంలో సమ్మె చేసిన సమయంలో యాజమాన్యం, ట్రాన్స్‌పోర్టు యూనియన్‌తో ఒప్పందం జరిగినట్టు తెలిపారు. ఒప్పంద వేతనాలు అమలు చేయాలని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్ప టికీ ఇంత వరకు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కోల్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీ యూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షులు స్వామి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు తిరుపతి, సంతోష్, చందర్‌లాల్, సతీష్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

వాంకిడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లక్ష్మీప్రసన్న మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జేత్వాన్ బుద్ధ విహర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. గురువారం విద్యార్థిని ఉదయం చనిపోయినా అధికారులు స్పందించక పోవడం విచారకరమన్నారు. ఆమె అస్వస్థతకు గురైన వెంటనే అధికారులు స్పందించలేదని చెప్పారు. సకాలంలో స్పందించి ఉంటే విద్యార్థిని బతికి ఉండేదని తెలిపారు. సమావేశంలో నాయకులు అశోక్, విజయ్, సందీప్, మనోజ్, రోషన్, సురేందర్, జైపాల్, స్వాగత్, చంద్రమణి, ప్రశాంత్, ప్రకాష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై కొమురయ్య

పెంచికలపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలోని వారసంతలో శుక్రవారం సైబర్‌నేరాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ ఇతరులకు తెలుపవద్దని అన్నారు. బ్యాంకు లోన్ మంజూరైందని, వివరాలు తెల పాలని ఎవరైనా వ్యక్తులు ఫోన్ చేస్తే పోలీస లకు సమాచారం అందించాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపో యాయని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్ర మంలో ఏఎస్సై ప్రభాకర్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

లింగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాంపూర్ కొలాంగూడా గ్రామానికి చెందిన టేకం సరిత(33) శుక్ర వారం అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చిం దని ఈఎంటీ శ్రీనివాస్, గజానంద్ తెలిపారు. సరితకు పురిటి నొప్పులు రావ డంతో కుటుంబసభ్యులు శుక్రవారం మధ్యా హ్నం అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబు లెన్స్ సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో సరిత ప్రసవించింది.

నేడు అవగాహన సదస్సు

రెబ్బెన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రాంమోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో ఆయా శాఖల అధికారు లు హాజరవుతున్నారని తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



బోరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యో తి): జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని అడదస్నా పూర్ గ్రామంలో కొనసా గుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో ప్రాథమిక, ఆరోగ్య కేంద్రాన్ని అభి వృద్ధి చేస్తుందని చెప్పారు. పనులు నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచిం చారు. అనంతరం తాగునీటి వనరుల లభ్య తను పరిశీలించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అందుబాటు లో ఉన్న తాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో అవసరమైతే కొత్త బారు బా వులు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయా లని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

కెరమెరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక అయిన లబ్ధిదారుల ఇళ్లను, వాటి స్థితి గతులను శుక్రవారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏ రకమైన ఇళ్లు ఉన్నాయి. తదితర అంశాలను పరిశీ లించారు. రింగన్ ఘాట్, గోయగాం గ్రామాల్లో ఎంపీడీవో అంజద్‌పాషా, సాకడ, సాంగ్వీ, ఖైరి గ్రామాల్లో పశువైద్యాధికారి సురేష్, తుమ్మగూడ, దేవాపూర్ గ్రామా ల్లో వ్యవసాయాధికారి యుగేందర్ పరిశీలించారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలం బిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20 తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంత చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువు రు మాట్లాడారు. సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కేంద్రం విధానాలతో కార్మికులు, పేదలకు నష్టం వాటిల్లుతుందని చెప్పా రు. ఈ విధానాలను కేంద్రం ఉపసంహరించుకునేంత వరకు నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, సుధాకర్, దత్తు, సురేష్, బాపురావు, రమేష్, జుగాదిరావు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోలేటి టౌన్ షిప్‌లో శుక్రవారం మే డే పోస్టర్లను ఇఫ్టూ, ఎస్‌సీసీడబ్ల్యుయూ ఏరియా నాయకులు గోలేటి శ్రీనివాస్, బండారి తిరుపతి పాటు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్త పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పలుమార్లు ఈ విషయంపై కేంద్రానికి విజ్ఞప్తి చేసినా దీనిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. బీజేపీ విధానాలతో కార్మికులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటారని, దీన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పోచం, చందు, కుమార్, భీమేష్, శేఖర్, కమల, తార, శంకరమ్మ, రాణి, సునీత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భారత పౌరుల జోలికొస్తే ఊరుకోం



రెబ్బెనలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భారత పౌరుల జోలికి వస్తే ఊరుకునేది లేదని జామా మసీద్ ఇమామ్ మొహమ్మద్ అయాజ్ అష్రఫ్, నాయకులు అబ్దుల్ ఫయాజ్, అబ్దుల్ రహెమాన్ అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ముస్లింలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నమాజ్ అనంతరం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, సాజీద్, సాలం, అహ్మద్, తాజ్, ఇమ్రాన్, లాయన్‌హుస్సేన్, అఖిల్, ముబషీర్ తదిత రులు పాల్గొన్నారు. హుంద మజీద్‌లో జుమా నమాజ్ అనంతరం ముస్లింలు చేతికి నల్ల రిబ్బెన్‌లు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ముతవల్లి సైద్‌బీన్ మోహసిన్, మసీద్ అధ్యక్షుడు ముబీన్, నాయకులు అలీబీన్ అవద్, పైసల్‌బీన్ మొహమ్మద్, గులాం, జావీద్, అబ్దుల్లాబీన్ ఉమర్, మోసిన్ బీన్ అమర్, అవున్ బీన్ అలీ, కాలీద్ బీన్ అబ్దుల్లా, హసన్‌బీన్ ఖలీద్, అఖిల్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో నాలుగు రోజుల క్రితం ఉగ్రవాదులు దాడి చేసి ప్రజ లను, పర్యాటకులను చంపేయడం హేయమైన చర్య అని ముస్లిం మత పెద్దలు అన్నారు. రెబ్బెనలో శు క్రవారం నమాజ్ అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో వారు మాట్లాడారు. పహల్గాం దాడిని ఖండి స్తున్నామని చెప్పారు. సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుతం ఇలాంటి ఘటనలో జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇమామ్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

బెజ్జూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిగూడ గ్రామంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఈ సమేరకు వంద లీటర్ల బెల్లం పానం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బానోత్ హరిప్రసాద్, నాగుతో విజయ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వధూత సత్యనారాయణ కిరాణ దుకాణంలో దాడి చేయగా 75 కిలోల బెల్లం, 20 కిలోల స్పటిక స్వాధీనం చేసుకు ని కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ అడ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నవీన్, కృష్ణ, సాయి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

వాంకిడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్ర పంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం డాక్టర్ విన య్, డాక్టర్ రిషిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిం చారు. మలేరియా వ్యాధి నివా రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ వో రవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేస్తున్నాయ్

● ప్రత్యేక నంబరుతో ముద్రణ ● పాఠశాలలు తెరిచే నాటికి అందించేలా ప్రణాళిక



గోడౌన్‌లోకి పుస్తకాలు తరలిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి సంబం ధించిన పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకుంటున్నాయి. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు పుస్తకాలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా బైలింగ్ వెల్ (తెలుగు, ఆంగ్లం) పద్ధతిలో పుస్తకాలు ముద్రించారు. మే రెండో వారం వరకు పూర్తి స్థాయిలో పుస్తకాలు జిల్లాకు చేరే అవకాశం ఉంది. అన్ని పుస్తకాలు వచ్చిన తర్వాత మండల కేంద్రాలకు మొదట పంపించారు. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిస్తారు. ఆ తర్వాత విద్యార్థులకు అందజేస్తారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా..

ఈసారి పుస్తకాల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. తరగతుల వారీగా పుస్తకాలపై ఉన్న సీరియల్ నంబర్లు రాసుకుం టున్నారు. ఏ సీరియల్ నంబరు పుస్తకాలు ఏ మం డలానికి పంపుతారో రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. మండల కార్యాలయాల నుంచి పాఠశాలలకు పంపిం చిన తర్వాత కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీని వల్ల ఏ పుస్తకం ఎవరి వద్ద ఉందో అధికారులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. మే రెండో వారం తర్వాత మండ లాలకు పుస్తకాల పంపి ణీ ప్రక్రియ ప్రారంబిం చనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

70 వేల మంది విద్యార్థులు..

జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 70 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మండల పరిష త్, జడ్పీ పరిధిలోని పాఠశాలలు, గురుకుల, కస్తూర్బా గాంధీ, ఆదర్శ, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారు. వీరికి 4,55,450 పుస్తకాలు అవసరమని అధికారులు ఇప్పటికే గుర్తించారు. వారం రోజులుగా 94,580 పుస్తకాలు గోదాంలకు చేరుకున్నాయి. వచ్చిన పుస్తకాలను టీఎస్ మోడల్ స్కూల్‌లోని గోదాంలో అధికారులు భద్రపరుస్తున్నారు.